ఎన్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్. చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా తదితరులు

భర్తతో భార్య ఎలా ఉండాలో కోర్టులకెందుకు?

- యువత వస్త్రధారణ బాధ్యత కోర్టులపై లేనేలేదు
- ప్రజలు ప్రమాణాలతో కూడిన తీర్పులు ఆశిస్తున్నారు
- న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదిస్తున్నారు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): భర్తతో భార్య ఎలా నడుచుకోవాలో, యువత ఎలాంటి వస్త్రాలు ధరించాలో చెప్పే బాధ్యత కోర్టులది కాదని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పష్టంచేశారు. ఇలాంటి అంశాలపై ఉత్తర్వులు జారీ చేసే బాధ్యత కోర్టులకు లేదన్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు 1963లో భార్యాభర్తల వివాదంలో ఇచ్చిన ఉత్తర్వులను, నిరుడు కోల్‌కతా హైకోర్టు యువతుల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఉదహరించారు. భార్య ముందుగా లేచి భర్తను నిద్రలేపాలని, భర్తకు కాఫీ ఇవ్వాలని, భర్తకు నచ్చినట్టుగా భార్య వస్త్రధారణ ఉండాలని మధ్యప్రదేశ్ హైకోర్టు చెప్తూనే.. ఆ విధంగా చేయకపోతే భార్యను కొట్టే హక్కు భర్తకు లేదని తీర్పు చెప్పిందని తెలిపారు. ఈ వివాదంలో భార్యను కొట్టే హక్కు భర్తకు లేదని తీర్పు చెప్పడం ఎంత కరెక్టో.. భార్య ఎలా ఉండాలో చెప్పిన రీజనింగ్ మాత్రం సమర్థనీయం కాదని చెప్పారు. ఇదే మాదిరిగా యువతుల వస్త్రధారణ ఎలా ఉండాలో గత ఏడాది కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పు కూడా సుప్రీంకోర్టుకు వచ్చిందని అన్నారు. ప్రజలు కోర్టుల నుంచి ప్రమాణాలతో కూడిన తీర్పులు ఆశిస్తున్నారని, వాళ్ల ఆశలు ఆవిరి కాకుండా చూడాల్సిన బాధ్యత న్యాయస్థానాలపై ఉన్నదని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం 'సమకాలీన న్యాయ పరిణామాలు-చట్టం-సాంకేతికతతో న్యాయవ్యవస్థ బలోపేతం' అనే అంశంపై దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు జరిగింది. జస్టిస్ భూయాన్ మాట్లాడుతూ..ప్రజలు కోర్టులపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కును కాపాడుతూ తీర్పు చెప్పాలని అన్నారు. ప్రాథమిక స్థాయి సివిల్ జడ్జి జీతం ఐఏఎస్ /ఐపీఎస్ స్థాయి అధికారుల జీతాల కంటే ఎక్కువగా ఉంటున్నదని, ప్రజలు కూడా ఆ స్థాయిలో కోర్టుల నుంచి సత్వర న్యాయం ఆశిస్తున్నారని చెప్పారు. చట్టబద్ధత, నిష్పక్షపాతం వంటివి ప్రజలు ఆశిస్తున్నారని, ప్రజలు ఉంచిన నమ్మకమే న్యాయ వ్యవస్థ ఆస్తి అని అన్నారు.

దురుద్దేశాలు.. సోషల్ మీడియా సవాళ్లు

న్యాయవ్యవస్థపై అనేక కోణాల్లో పరిశీలన పెరిగిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్ ఓకా చెప్పారు. ఇప్పటికే మీడియా, న్యాయవాదులు, పలు సంస్థలు తీర్పులను ఇతర అంశాలను పరిశీలించి సమీక్ష చేస్తున్నాయని, సోషల్ మీడియా ప్రభావం రానున్న రోజుల్లో కొత్త జడ్జిలకు సవాలుగా మారనున్నదని చెప్పారు. గతంలో పరిశీలన, అభిప్రాయాలు మాత్రమే వ్యక్తమయ్యేవని, ఇప్పుడు పనితీరుపై దురుద్దేశాలనూ అపాదిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక మాధ్యమాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు జడ్జీల వరకు అందరికీ శిక్షణ అవసరమని అన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ప్రసంగిస్తూ.. రాజ్యాంగ నైతికత, సమకాలీన మార్పులు, న్యాయమూర్తుల ప్రవర్తన, కోర్టుల తీర్పులు రాయడంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై సదస్సు చర్చిస్తుందని చెప్పారు. జాతీయ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ సుజయ్ పాల్, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, తమిళనాడు. కర్ణాటక, కేరళ, రాష్ట్రాల జడ్జీలు పాల్గొన్నారు..

హైకోర్టుకు వర్సిటీ భూములొద్దు!

- ఈ నిర్ణయం జీవ వైవిధ్యానికే పెనుముప్పుగా మారుతుంది
- జంతుజాలం ఆవాసం కోల్పోయే ప్రమాదం
- నిర్మాణాలతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది
- మహానగరంలో పచ్చదనం కనుమరుగు ఖాయం
- అగ్రి బయోడైవర్సిటీ పార్కును పరిరక్షించాల్సిందే
- పర్యావరణవేత్తలు, పరిశోధకులు, విద్యార్థుల ఆందోళన
- ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వినతులు

హైదరాబాద్ సిటీబ్యూరో/హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్ర సర్కారు తీసుకున్న నిర్ణయంతో జీవ వైవిధ్యానికే ప్రమాదం వచ్చింది. వందల ఎకరాల్లో హైకోర్టు నిర్మాణానికి పూనుకోవడంతో అరుదైన వృక్ష జాతులు, అంతరించిపోయే జీవ జాతులు, అంతకు మించిన వ్యవసాయ పరిశోధనలకు నిలయంగా ఉన్న అగ్రి బయోడైవర్సిటీ పార్కులో జంతుజాలం ఆవాసం కోల్పోనున్నది. ఇన్నాళ్లూ జంతుజాలానికి కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు నిర్మాణలు పుంజుకొంటే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంద'ని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎంతో అరుదైన జంతు, వృక్ష, జీవ సంపదకు నిలయంగా ఉన్న పార్కును పరిరక్షించుకోవాలని పిలుపునిస్తున్నారు. గడిచిన కొంతకాలంగా ఈ పార్కును అభివృద్ధి చేయడంతోపాటు ఇక్కడి జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేసిన సంస్థలతోపాటు వర్సిటీ విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాలు, పర్యావరణ ప్రేమికులు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

ఉపసంహరించుకోవాలి: ఏబీవీపీ డిమాండ్

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించడం తగదని, ఈ భూ కేటాయింపు జీవోను వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ వర్సిటీ ప్రాంగణంలో హైకోర్టును నిర్మించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ప్రకటించారు. వ్యవసాయరంగం, రైతులను పటిష్ఠం చేసేందుకు పరిశోధనలు చేస్తున్న ఈ వర్సిటీని కాపాడుకుంటామని, గుంట భూమిని కూడా వదలబోమని తెలిపారు.

సర్కారు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

స్థలాన్ని వెనక్కి తీసుకోవాలి: వర్సిటీ విద్యార్థులు

తెలంగాణ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వ్యవసాయ విశ్వవిద్యాలయ స్థలాన్ని వెనక్కి తీసుకోవాలని వర్సిటీ విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సచివాలయంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సత్యమూర్తి, జే సురేశ్, వీ సతీశ్, డీ వినయ్, భరత్ తదితరులు వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. క్రాప్ కాలనీలు, విత్తన అభివృద్ధి, వ్యవసాయ అవసరాలు, పరిశోధనలు, అనేక కొత్త రకాల వంగడాలు, ఇతర పర్యావరణపరమైన వాటికి అనువుగా ఉండే ప్రాంతాన్ని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా హైకోర్టుకు కేటాయించడాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ వ్యవసాయ విశ్వవిద్యాలయంతోపాటు హార్టికల్చర్ యూనివర్సిటి కార్యకలాపాలు సాగుతాయని, నిర్మాణ సమయంలో అక్కడి వాతావరణానికి, పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తి పరిశోధనలకు ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. నగరంలో అనేకచోట్ల ప్రభుత్వ స్థలాలున్నాయని, హైకోర్టుకు అక్కడ స్థలం కేటాయిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

ఉద్యాన వర్సిటీకి 100 ఎకరాలు కేటాయించండి

నూతన హైకోర్టు నిర్మాణానికిగానూ ఉద్యాన వర్సిటీకి చెందిన 57 ఎకరాలను తీసుకుంటున్న ప్రభుత్వం.. ఆ స్థానంలో యూనివర్సిటీకి 100 ఎకరాల స్థలం కేటాయించాలని ఆ వర్సిటీ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం యూనివర్సిటీ భూమిని హైకోర్టుకు ఇవ్వడంపై చర్చించేందుకుగానూ సమావేశం నిర్వహించారు. పరిశోధనలకు ఉపయోగపడుతున్న భూమిని హైకోర్టుకు కేటాయించడాన్ని తప్పుపట్టారు. ఒకవేళ తప్పక ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడితే ఉద్యాన పరిశోధనలకు ఇబ్బంది రాకుండా ఉండేందుకుగానూ యూనివర్సిటీకి 100 ఎకరాలు కేటాయించాలని కోరారు. హైకోర్టు కేటాయించిన భూమిలో ఉద్యాన యూనివర్సిటీకి చెందిన ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కల పరిశోధన స్థానం, పోస్ట్ హర్వేస్ట్ టెక్నాలజీ పరిశోధన స్థానం, మోడల్ ఆర్చర్డ్, కూరగాయల పరిశోధన స్థానం, ఏఐసీఆర్పీపీ స్కీమ్‌లతో నడిచే పరిశోధన స్థానం ఉన్నదని చెప్పారు. ప్రత్యేకించి 40 ఏండ్ల నుంచి పరిశోధన చేస్తున్న బహువార్షిక ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కలు, వందలాది జర్మ్ ప్లాజం, అలాగే రైతులకు ఉపయోగపడే నూనెతీత యంత్రాలు, దీనికి తోడు పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనకు యూజీ బీఎస్సీ హార్టికల్చర్ విద్యార్థుల ఎక్స్‌పీరియన్సియల్ లర్నింగ్ ప్రోగ్రాంకు సంబంధించిన ఇన్‌స్ట్రక్షనల్ ఫామ్స్ ఇందులో ఉన్నాయని తెలిపారు. ఒకవేళ యూనివర్సిటీకి అదనపు స్థలం కేటాయించని పక్షంలో ఉద్యాన పరిశోధనలు కుంటుపడుతాయని, ఇది రాష్ట్ర వ్యవసాయరంగంపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కలిసికట్టుగా అభివృద్ధి..

వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అగ్రి బయోడైవర్సిటీ పార్కు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందు వచ్చారు. ముఖ్యంగా పార్కులో మౌలిక వసతులు, మొక్కల పెంపకంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛంద సంస్థ నిర్మాణ్ కూడా ముందుకు వచ్చింది. ప్రాజెక్టు అభివృద్ధికి అగ్రి వర్సిటీతో కలిసి నిధులను సమీకరించింది. నిరుడు అగ్రికల్చర్ వర్సిటీతో కలిసి చెరువులు, కుంటల సంరక్షణకు కృషి చేసింది. దాదాపు 300 మొక్క జాతులను పెంచేందుకు సాయమందించినట్టు నిర్మాణ్ సంస్థ ప్రతినిధి తిరుపతి వెల్లడించారు. తాజాగా, కాంగ్రెస్ సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఇక్కడి దశాబ్ద కాలంగా అభివృద్ధి చేసిన పర్యావరణానికి ముప్పు వాటిల్లనున్నదని ఆ సంస్థ ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతికి నిలయంగా ఉన్న పదుల ఎకరాల భూముల్లో నిర్మాణ పనులు చేపడితే.. జంతుజాలం ఆవాసం కోల్పోయే ప్రమాదం ఉన్నదని అంటున్నారు. ముఖ్యంగా అరుదైన అతి చిన్న వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో పచ్చదనం, పర్యావరణమే కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పార్కు ఏర్పాటు

రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 70-80 ఎకరాల పరిధిలో ఆగ్రో ఫారెస్ట్రీ ఉన్నది. 1987లో ఓ పరిశోధన ప్రాజెక్టుగా దీన్ని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ పరిధిలో మరో 130 ఎకరాల్లో అగ్రి బయోడైవర్సిటీ పార్కు ఉన్నది. 2010లో అప్పటి సీఎం రోశయ్య దీన్ని ప్రారంభించారు. వైవిధ్యమైన వృక్షజాతులు, పక్షులు, కీటకాలుసహ అత్యంత అరుదైన జీవజాతులకు ఇది నిలయంగా మారింది. ఏండ్ల తరబడి వాటికి అనువైన పరిస్థితులు కల్పించడం వల్లే ఇవన్నీ ఇక్కడ వృద్ధి చెందాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కాగా, నాడు కాంగ్రెస్ హయాంలో ఏర్పాటైన అగ్రి బయోడైవర్సిటీ పార్కు... అదే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రూపురేఖలు కోల్పోనున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

టూరిజం కార్పొరేషన్ ఎండీగా రమేశ్‌నాయుడు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా 2006 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రమేశ్‌నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

మంత్రి కోమటిరెడ్డికి గొంతు శస్త్ర చికిత్స

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గొంతు శస్త్ర చికిత్స జరిగింది. గొంతు నొప్పితో బాధపడుతున్న కోమటిరెడ్డి ఇటీవల అపోలో దవాఖానలో చేరగా, ఆయన గొంతుకు వైద్యులు శస్త్ర చికిత్స చేశారు.

వైసీపీకి రాయుడు గుడ్‌బై

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఆడుదాం ఆంధ్రా అంబాసిడర్, వెటరన్ క్రికెటర్ అంబటిరాయుడు శనివారం వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు అంబటిరాయుడు ఎక్స్ వేదికగా ప్రకటించారు.

సోషల్ మీడియా సాయంతో తిరిగొచ్చిన ఎయిర్‌పాడ్స్

ముంబై : ముంబైకి చెందిన సోషల్ మీడియా మార్కెటింగ్ ప్రొఫెషనల్ నిఖిల్ జైన్ డిజిటల్ సామర్థ్యాన్ని నమ్ముకుని విజేతగా నిలిచారు. నిఖిల్ జైన్ డిసెంబరులో కేరళలోని ఓ నేషనల్ పార్కులో బస్సులో ప్రయాణిస్తుండగా ఆయన ఎయిర్ పాడ్స్ పోయాయి. సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో వాటిని గుర్తించలేకపోయారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత పరిశీలిస్తే, ఆ ఎయిర్‌పాడ్స్‌ను ఓ వ్యక్తి తీసుకెళ్తున్నట్టు, ఆ వ్యక్తి 40 కిలోమీటర్ల దూరంలోని వేరొక నేషనల్ పార్క్‌లో ఉన్నట్టు గుర్తించారు. ఆ వ్యక్తి చివరికి మంగళూరు నుంచి గోవాకు వెళ్లినట్టు గుర్తించారు. సోషల్ మీడియాపైన ఉన్న గట్టి నమ్మకంతో నిఖిల్ డిసెంబరు 21న ఓ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన నెటిజన్లు డిటెక్టివ్‌లుగా మారిపోయారు. చివరికి ఆ ఎయిర్ పాడ్స్ మార్గోవా పోలీస్ స్టేషన్‌కు చేరాయి. డిసెంబరు 22న సాయంత్రం స్నేహితుడు తీసుకొచ్చి, నిఖిల్‌కు అందజేశారు.

వెల్‌స్పన్ గ్రూప్ రూ.250 కోట్ల పెట్టుబడులు

- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు వెల్‌స్పన్ గ్రూప్ సంసిద్ధత వ్యక్తంచేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో వెల్‌స్పన్ గ్రూప్ చైర్మన్ బీకే గోయెంకాతోపాటు కంపెనీ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. సీఎం మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడులను ఆహ్వానించేందుకు ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని అనుసరిస్తున్నదని తెలిపారు. గోయెంకా మాట్లాడుతూ తమ కంపెనీ భవిష్యత్తులో చందన్‌వెల్లి పారిశ్రామికవాడలో ఐటీరంగంలో రూ.250 కోట్ల పెట్టుబడి పెడుతుందని చెప్పారు. టైర్ 2, 3 నగరాల్లో ఐటీని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, స్పెషల్ సెక్రటరీ డాక్టర్ విష్ణురెడ్డి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, వెల్‌స్పాన్ గ్రూప్ హెడ్(కార్పొరేట్ వ్యవహారాలు) చింతన్‌ఠాకర్, శ్రీసభార్గవ మొవ్వ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్ ఖర్చు చేసింది కర్ణాటక ప్రజా ధనమే'

బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్‌పై మాజీ ప్రధాన మంత్రి, జేడీఎస్ వ్యవస్థాపకుడు హెచ్‌డీ దేవెగౌడ విరుచుకుపడ్డారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఖర్చు చేసినది కర్ణాటక ప్రజా ధనమేనని ఆరోపించారు. ఎన్నికల్లో పోరాడటానికి కాంగ్రెస్ పార్టీకి కర్ణాటకనుంచి, ముఖ్యంగా బెంగళూరు నుంచి జరిగిన ధన ప్రవాహాన్ని సిద్ధరామయ్య నిరోధించలేకపోయారని దుయ్యబట్టారు. బెంగళూరులో జరుగుతున్న అక్రమాలను ఎందుకు ఆపలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇదంతా కర్ణాటక ప్రజల సొమ్ము అని చెప్పారు. అవినీతిని అరికట్టే సత్తా సిద్ధరామయ్యకు ఉందని తాను అనుకోవడం లేదన్నారు.

మూడు క్లస్టర్లుగా తెలంగాణ

- పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్-2050
- రాష్ట్రమంతా పారిశ్రామిక అభివృద్ధి
- ఫార్మాసిటీలా కొత్తగా ఫార్మా విలేజీలు
- సోలార్ పవర్ పాలసీకి రూపకల్పన
- యువత కోసం స్కిల్ యూనివర్సిటీ
- సీఐఐ ప్రతినిధులతో సీఎం రేవంత్

శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఐఐ ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ): తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్) లోపలి ప్రాంతాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఆ తర్వాత రీజినల్ రింగ్‌రోడ్డు వరకు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజనల్ రింగ్‌రోడ్డు తర్వాత చుట్టూ ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా విభజిస్తామని తెలిపారు. పారిశ్రామికంగా అన్ని రంగాలు అభివృద్ధి చెందేలా ఫ్రెండ్లీ పాలసీని అమలు చేసేందుకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. శనివారం సచివాలయంలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి, పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఫ్రెండ్లీ పాలసీని అనుసరిస్తుందని పేర్కొన్నారు. వచ్చే పాతికేళ్లనాటికి నాటికి తెలంగాణ అంతటా పారిశ్రామికవృద్ధి జరగాలనే భవిష్యత్తు లక్ష్యంతో మెగా మాస్టర్ ప్లాన్-2050కి రూపకల్పన చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు పరిశ్రమల అభివృద్ధికి అనుసరించిన ఫార్ములా ఒకలా ఉంటే, 2004 నుంచి 2014 వరకు అది మరో మెట్టుకు చేరుకుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇది అత్యున్నత వృద్ధి దశకు చేరుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణలోని అన్ని ప్రాంతా లు హైదరాబాద్ తరహాలోనే అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఫార్మాసిటీ కాదు.. ఫార్మా విలేజీలు

ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని రేవంత్ తెలిపారు. ఫార్మాసిటీగా కాకుండా ఫార్మా విలేజీలను అభివృద్ధి చేస్తామని వివరించారు. ఓఆర్‌ఆర్‌పై 14 రేడియల్ రోడ్లు ఉన్నాయని, వీటికి 12 జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని, వీటికి అందుబాటులో ఉండేలా దాదాపు వెయ్యి నుంచి 3 వేల ఎకరాలకో ఫార్మా విలేజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సోలార్ పవర్ పాలసీ

జహీరాబాద్‌లో ఐటీ, ఫార్మా, హెల్త్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబైల్, ఆర్గానిక్ క్లస్టర్లుగా అక్కడ పరిశ్రమల ఏర్పాటు జరగాలని సీఎం ఆకాంక్షించారు. రక్షణరంగం, నావికారంగానికి అవసరమైన పరికరాల తయారీ, ఉత్పత్తికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలున్నాయని, పారిశ్రామికవేత్తలు వీటిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కొత్తగా సోలార్ పవర్ పాలసీ రూపొందిస్తామని, సోలార్ ఎనర్జీ పరిశ్రమలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం తెలిపారు.

35 లక్షలమంది నిరుద్యోగులు

రాష్ట్రంలో ఉన్న దాదాపు 35 లక్షలమంది నిరుద్యోగులను భారంగా భావించడం లేదని, వారిని పరిశ్రమల అభివృద్ధిలో పాలు పంచుకునే మానవ వనరులుగా భావిస్తున్నట్టు సీఎం చెప్పారు. యువత నైపుణ్యం సాధించేలా స్కిల్ యూనివర్సిటీలు నెలకొల్పుతామని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ప్రతినిధులు సీ శేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్, డాక్టర్ మోహన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, సుచిత్రా కె ఎల్లా, వనిత దాట్ల, రాజు, సంజయ్‌సింగ్, ప్రదీప్ ధోబాలే, శక్తిసాగర్, వై హరీశ్‌చంద్రప్రసాద్, గౌతమ్‌రెడ్డి, వంశీకృష్ణ గడ్డం, శివప్రసాద్‌రెడ్డి రాచమల్లు, రామ్, చక్రవర్తి, షేక్ షమీవుద్దీన్, వెంకటగిరి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మరో నాలుగు డంప్‌యార్డ్‌లు

నగరం నాలుగువైపులా జనావాసాలకు దూరంగా నాలుగు డంప్‌యార్డ్‌లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ మొత్తానికి జవహర్‌నగర్‌లో ఒకే ఒక్క డంప్ యార్డ్ ఉంది. మెట్రోరైల్ రూట్ విస్తరణపై సీఎం మాట్లాడుతూ గతంలో సర్వేచేసిన గౌలిగూడ-ఫలక్‌నుమా-విమానాశ్రయం, ఎల్బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టు రూట్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మూసీనది పరీవాహక ప్రాంతాల్లోని చార్మినార్, గోల్కొండ, సెవెన్‌టూంబ్స్, తారామతి బారాదరి వంటివాటిని అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్ రూపొందించాలని కోరారు. ఈ ప్రాంతంలో పీపీపీ మోడల్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్టు సీఎం తెలిపారు. .

మాజీ రాష్ట్రపతి కోవింద్‌ను కలిసిన రేవంత్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి శనివారం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ కొంతసేపు ముచ్చటించారు. సచివాలయానికి వెళ్లిన మాజీ గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్ శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా రేవంత్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల కోసం ఎలక్షన్ కమిటీలను ఏఐసీసీ ఏర్పాటు చేసింది. తెలంగాణ కాంగ్రెస్ కమిటీని శనివారం ప్రకటించింది. కమిటీ చైర్మన్‌గా సీఎం రేవంత్‌ను నియమించింది. జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రేవంత్‌సహా 25 మందికి కమిటీలో చోటు కల్పించారు. డిప్యూటీ సీఎం భట్టి, జీవన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జానారెడ్డి, వీహెచ్, చల్లా వంశీచంద్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, మధుయాష్కీగౌడ్, సంపత్‌కుమార్, రేణుకాచౌదరి, బలరాంనాయక్, జగ్గారెడ్డి, గీతారెడ్డి, అజారుద్దీన్, అంజన్‌కుమార్‌యాదవ్, మహేశ్‌కుమార్‌గౌడ్, షబ్బీర్ అలీ, ప్రేమ్‌సాగర్‌రావు, పొదెం వీరయ్య, సునీతరావు ఉన్నారు.

రేవంత్ లక్కీ నంబర్ 9!

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): తన లక్కీ నంబర్ 9 అని పలుమార్లు వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అందుకు అనుగుణంగా సచివాలయంలో తన చాంబర్‌ను, తాను ఉపయోగించే వాహనాల నంబర్ ప్లేట్లను మారుస్తున్నట్టు తెలుస్తున్నది. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మాజీ సీఎం కేసీఆర్ చాంబర్ 6వ అంతస్థులో ఉండగా.. దానిని ఇప్పుడు 9వ అంతస్థుకు మారుస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వారిని ఆదేశించినట్టు సమాచారం. ఇటీవల సీఎం రేవంత్ 9వ అంతస్తును పరిశీలించి, చాంబర్ ఏర్పాటుకు ఉన్న సానుకూలతలను పరిశీలించారని అధికారులు తెలిపారు. ఇప్పటికే 9వ అంతస్థులోకి ఫర్నిచర్‌ను, దస్త్రాలను తరలిస్తున్నట్టు చెప్తున్నారు. సీఎం లక్కీ నంబర్ ప్రకారమే ఈ మార్పు జరుగుతున్నదని అంటున్నారు. సీఎం కాన్వాయ్‌లోని వాహనాల నంబర్ ప్లేట్లు కూడా 9తో ఉండేట్టు మారుస్తున్నారని తెలిసింది. దివంగత మాజీ సీఎం ఎన్టీరామారావుకు కూడా లక్కీ నంబర్ 9 కావడం గమనార్హం.



9 నంబర్ ప్లేట్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్

మేడారంలో కన్వేయర్ బెల్ట్!

- గద్దెల చెంతకు నేరుగా బెల్లం చేరేలా ఏర్పాట్లు
- నమూనాను మంత్రికి వివరించిన అధికారులు



కన్వేయర్ బెల్టు నమూనా చిత్రం

తాడ్వాయి, జనవరి 6: వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తులు సమర్పించే బంగారం (బెల్లం) భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా తల్లుల చెంతకు చేరేలా దేవాదాయశాఖ అధికారులు కన్వేయర్ బెల్టు ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ప్రధాన గేటు లోపలికి వచ్చే దారిలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. భక్తులు తల్లులకు సమర్పించే బెల్లాన్ని మెయిన్ గేట్ వద్ద ఏర్పాటు చేసే బెల్టుపై వేయగానే అది నేరుగా తల్లుల గద్దెల వద్దకు వెళ్లి లోపల పడిపోతుంది. ప్రతిసారీ జాతర సమయంలో గద్దెలు మొత్తం బెల్లంతో నిండిపోవడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. గద్దెల వద్ద బెల్లం కరిగిపోయి పానకంగా మారి భక్తుల కాళ్లకు అంటుకుని మేడారం పరిసరాల్లో మొత్తం వ్యాపిస్తున్నది. దీంతో ఈగల బెడద పెరగడంతోపాటు, గద్దెలను శుభ్రం చేయడం ఇబ్బందిగా మారుతున్నది. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు కన్వేయర్ బెల్టును సుమారు రూ.80 లక్షలతో ఏర్పాటు చేయనున్నారు. మొదట సమ్మక్క గద్దెపై బెల్లాన్ని బెల్టు ద్వారా చేర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇది విజయవంతమైతే వచ్చే జాతరకు సారలమ్మ గద్దె వద్దకు బెల్లం చేర్చేందుకు, గద్దెలపై పోగైన బెల్లాన్ని బయటికి తరలించేందుకు కన్వేయర్ బెల్టులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఓ సంస్థకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు సాధ్యాసాధ్యాలపై దేవాదాయశాఖ అధికారులతో చర్చించారు. అనంతరం మేడారం పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠికి వివరించారు.

27 లక్షల మందికి రైతుబంధు

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- వ్యవసాయ కార్పొరేషన్ల పనితీరుపై మంత్రి ఆరా
- పని విభజనపై నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఇప్పటిరకు రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది అన్నదాతలకు రైతుబంధు నిధులను జమచేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రైతుబంధు నిధుల విడుదలపై ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, వ్యవసాయ శాఖ కార్యదర్శి, డైరెక్టర్‌తో మంత్రి శనివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 40 శాతం (27 లక్షల) మంది రైతులకు మాత్రమే రైతుబంధు నిధులు జమయ్యాయని అధికారులు వెల్లడించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. యాసంగి సాగు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో రైతుబంధు సొమ్మును వెంటనే జమచేయాలని ఆదేశించారు. ఈ అంశంపై సంక్రాంతి తరువాత మరోసారి సమీక్ష నిర్వహిస్తానని వెల్లడించారు. ఇటీవల కార్పొరేషన్ల పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల.. కార్పొరేషన్ల పనితీరు వివరాలపై విస్మయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఒకే రకమైన పనిని వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉన్న వేర్వేరు కార్పొరేషన్లు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ల పని విభజనపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఆ తర్వాత కార్పొరేష్ల పనితీరుపై క్షుణ్ణంగా చర్చించి పలు కార్పొరేషన్ల పనుల్లో కోత పెట్టనున్నట్టు సమాచారం. ప్రతి కార్పొరేషన్ సొంత ఆదాయ మార్గాలను అన్వేషించాలని, ఇందుకోసం ఇతర వ్యాపారాలను కూడా నిర్వహించాలని ఆదేశించినట్టు తెలిసింది.

జల్లికట్టులో 29 మందికి గాయాలు

చెన్నై: తమిళనాడులోని పుదుకొట్టైలో నిర్వహించిన జల్లికట్టులో 29 మంది గాయపడ్డారు. వీరిని తంజావూరు వైద్య కళాశాల దవాఖానకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు. మరోవైపు శ్రీలంకలోని ట్రింకోమలీలో జల్లికట్టు క్రీడను ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, మలేసియా ఎంపీ ఎం శరవణన్ శనివారం ప్రారంభించారు. ఈ క్రీడలో 200 ఎద్దులు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.